ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





బేతోలు గ్రామం వ్యూ

ఊరంతా మేడలు కట్టే వారే..

తాపీ మేస్త్రీలుగా రాణిస్తున్న బేతోలు వాసులు

- గ్రామంలో 550 కుటుంబాలుంటే.. ఇంటికొక్కరు సుతారి..
- ప్రతీరోజు రూ.1000 నుంచి రూ.1200 సంపాదన
- తాతల నాటి నుంచి నిర్మాణ రంగంలో రాణిస్తున్న స్థానికులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వారు తాపీ పడుతే.. పెద్దపెద్ద భవనాలు తయారవుతాయి. చెయ్యేత్తే అందమైన ఆకృతుల బవంతులు రూపుదిద్దుకుంటాయి. తాతల నాటి నుంచి ఇప్పటి వరకు తాపీ చేతపట్టి మేడలు కడుతున్నారు. సాంకేతికత వృద్ధి చెందినా బేతోలు ఊరు జనం తాతల, తండ్రుల వారసత్వంగా వస్తున్న తాపీని చేత పట్టి భవంతుల నిర్మాణ పనులు చేస్తున్నారు. మహిళలూ సైతం నిర్మాణ రంగ కార్మికులుగా రాణిస్తున్నారు..

మహబూబాబాద్- మరిపెడ 365 జాతీయ రహదారిపై మానుకోట జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న బేతోలు గ్రామంలో ఇంటికొక మేస్త్రీ ఉన్నారంటే అతిశయోక్తి కాదు.. తాతలు, తండ్రులు సుతారీ పని చేయడంతో ఈ తరం యువకులు సైతం ఆ వృత్తినే ఎంచుకోవడంతో.. ఇంటి కొక మేస్త్రీ చొప్పున భవన నిర్మాణ రంగంలో పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

మునిసిపాలిటీలో కలసిన గ్రామం..

మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న బేతోలు గ్రామం గతంలో ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఉండేది. 2018 సంవత్సరంలో మహబూబాబాద్ పట్టణానికి నలు దిక్కుల నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామ పంచాయతీలను మునిసిపాలిటీలో విలీనం చేయడంతో బేతోలు గ్రామం కూడా మానుకోట మునిసిపాలిటీలో కలిసి పోయింది. ఆ పల్లెలో 550 కుటుంబాల వరకు జీవిస్తున్నారు. అందులో ఇంటికొక్కరి చొప్పున అంటే దాదాపుగా 500 మంది సుతారీ మేస్త్రీలుగా పని చేస్తున్నారు. గ్రామంలో ఎంపీటీసీలుగా, సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా కొనసాగినా వారు సైతం మేస్త్రీలుగా పని చేసిన వారే ఉన్నారు. ఆ గ్రామం నుంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డ వారిలో కొంతమంది గతంలో భవన నిర్మాణ పనులను చేసిన వారున్నారు. మరోపక్క మహిళా కూలీలు కూడా భవన నిర్మాణ రంగ కార్మికులుగా పని చేస్తున్నారు. ప్రతీ రోజు మేస్త్రీ రూ. 1000 నుంచి 1200, భవన నిర్మాణ కార్మికుడు రూ.700 నుంచి 800 సంపాదించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

యావత్ తెలంగాణలో..

మహబూబాబాద్ జిల్లా కేంద్రం పరిసర ప్రాంతాల్లోనే కాదు.. బేతోలు మేస్త్రీలు యావత్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో మేడలు కడుతున్నారు. హైదరాబాద్, వరంగల్, సూర్యాపేట, గోదావరిఖని, ఖమ్మం ప్రాంతాలకు వలస బాట పట్టి అక్కడ స్థిరపడి సుతారీ పని చేసుకుంటూ.. జీవనోపాధి పొందుతున్నారు. ఏ గ్రామంలోనైనా సామాజిక వర్గం ఆధారంగా వృత్తిని ఎంచుకుంటారు ఇక్కడ మాత్రం తాత, ముత్తాల నుంచి వస్తున్న తాపీ పనినే వృత్తిగా ఎంచుకోవడంతో గ్రామంలో భవన నిర్మాణ కార్మికులు అధికంగా ఉన్నారు. పెంకుటిల్లు నుంచి మొదలుకుని అందమైన భవంతుల వరకు నిర్మిస్తున్నారు. ఇళ్ల నిర్మాణంలో బేతోలు మేస్త్రీలు పేరు ప్రఖ్యాతులు గడిస్తున్నారు. డిగ్రీలు పూర్తిచేసి ఉపాధి కోసం ఎదురు చూస్తున్న కొంత మంది యువకులు సైతం ఖాళీగా ఉండకుండా అదే వృత్తిని ఎంచుకుని పని చేస్తూ కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారు.



ఇంటి నిర్మాణంలో పని చేస్తున్న బేతోలు భవన నిర్మాణ కార్మికులు

తులారాం ప్రాజెక్టు పనికి వెళ్లాను ..



తమ తాతల నుంచి సుతారీ పనులు చేసుకుంటూ వస్తున్నాం. 1970 సంవత్సరంలో జిల్లాలోని బయ్యారం మండలంలో నిర్మించిన తులారాం ప్రాజెక్టు నిర్మాణ పనులకు వెళ్లాను. అప్పట్లో రూ.2 కూలీగా ఇచ్చారు. ఈ ప్రాంతంలో భవన నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ ఇద్దరు కుమారులకు పని నేర్పించాను. ఇప్పుడు వారు మేస్త్రీ, బిల్డర్లుగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.

\- షేక్ యూసూఫ్, మేస్త్రీ, బేతోలు

చదువుకునే రోజుల్లో తాపీ పని చేశా..



తాను చదువుకునే రోజుల్లో సెలవు దినాల్లో తాపీపని నేర్చుకుని భవన నిర్మాణ పనులు చేశాను. 2008 సంవత్సరంలో రెవెన్యూశాఖలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (వీఆర్వో)గా ఉద్యోగం వచ్చింది. అప్పటి నుంచి ఉద్యోగ విధులు నిర్వర్తిస్తూనే సమయం దొరికినప్పుడల్లా తాపీ చేత పట్టి పని చేస్తాను.

\- షేక్ అలీ, రెవెన్యూ ఉద్యోగి, బేతోలు

రేపటి నుంచి సీతారామచంద్రస్వామి

బ్రహ్మోత్సవాలు

- 12న స్వామివారి కల్యాణోత్సవం
- రెడ్యాలలో ముస్తాబైన దేవాలయం



శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలు

మహబూబాబాద్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్యాలలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ముస్తాబైంది. గ్రామంలో ఈనెల 10వ తేదీ నుంచి 13 వరకు స్వామివారి పంచమ వార్షిక బ్రహోత్మవాలు నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు గ్రామస్థులంతా పెద్దఎత్తున పాల్గొని, వేడుకలను అంగరం వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. కాగా, రెడ్యాలలో గ్రామ మాజీ సర్పంచ్, టీపీసీసీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, సోదరుడు ఎన్ఆర్ఐ వెన్నం విజయకాంత్‌రెడ్డి, గ్రామస్థులంతా కలిసి నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయాన్ని 2020న డిసెంబర్ 7న శ్రీశ్రీశ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామనుజ చిన్నజీయర్‌స్వామి చేతుల మీదుగా దేవాలయాన్ని ప్రారంభించుకున్నారు. నాటి నుంచి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది ఆదివారం నుంచి బ్రహోత్మవాలు జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కార్యక్రమాలు ఇలా..

రెడ్యాల గ్రామంలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో 10న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణతో బ్రహోత్మవాలు ప్రారంభం కానున్నాయి. 11న ఉదయం 8 గంటల నుంచి మహాకుంభస్థాపన, అగ్నిప్రతిష్ట, నిత్యపూర్ణహుతి, ధ్వజారోహణం, సాయంత్రం 6.30 గంటల నుంచి నిత్యవిధి హోమాలు, పూర్ణాహుతి, తీర్థప్రసాదగోష్టి జరుగుతుంది. 12న ఉదయం 9 గంటలకు యాగశాలలో నిత్యారాధనం, 10 గంటలకు శ్రీసుదర్శనయాగం, రాత్రి 7.30 గంటలకు సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం, 8.30 గంటలకు తీర్థప్రసాద్ గోష్టి ఉంటుంది. చివరిరోజు 13న ఉదయం 9గంటలకు మహాపూర్ణాహుతి, 11 గంటలకు నవకలశ స్నపనం, చక్రస్నానం, మధ్యాహ్నం ఒంటి గంటకు మంగళశాసనం, సాయంత్రం 6 గంటలకు పుష్పయాగ మండపారాధన, శ్రీపుష్పయాగం, మంగళాశాసనము, తీర్థప్రసాద గోష్టితో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి
జన్మదిన వేడుకలు
- కేక్ కట్ చేసిన కాంగ్రెస్ శ్రేణులు
- బాణాసంచా కాల్చిన కార్యకర్తలు
8



విజేతలకు ట్రోఫీని అందిస్తున్న విద్యారాణి

విద్యార్థులు క్రీడల్లో మెరవాలి

- భద్రాద్రి జోన్ అధికారి విద్యారాణి
- ముగిసిన గురుకుల జోనల్ క్రీడలు

మరిపెడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడా పోటీల్లో సైతం మెరవాలని సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ భద్రాద్రి జోన్ అధికారి విద్యారాణి అన్నారు. మరిపెడ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో శనివారం భద్రాద్రి జోన్ 11వ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు ముగింపు సమావేశానికి హాజరై, ఆమె విజేతలకు మెమెంటోలను బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. స్పోర్ట్స్ కోటలో ఉన్నత విద్యకు అవకాశం లభిస్తుందన్నారు. క్రీడాకారులు గెలుపు.. ఓటములను సమానంగా స్వీకరించి రేపటి గెలుపు కోసం మెళకువలు నేర్చుకోవాలన్నారు. విజేతలకు ఆమె మెమెంటోను అందించి అభినందించారు. హోరాహోరీగా ఫైనల్ క్రీడాపోటీలు రసవత్తరంగా జరిగాయి. అండర్- 14 ఓవరాల్ ఛాంపియన్‌గా మరిపెడ, అండర్-17, అండర్19 ఓవరాల్ ఛాంపియన్‌గా పాల్వంచ గురుకుల విద్యార్థులు నిలిచారు. ఈ కార్యక్రమంలో మరిపెడ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దయాకర్, ఫిజికల్ డైరెక్టర్ రవి, పీఈటీ రవి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా, క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేసి అభినందించారు.

అంగడిలో సెల్‌ఫోన్లు మాయం

- సంచరిస్తున్న మొబైల్‌ఫోన్లు చోరీచేసే గ్యాంగ్ సంచారం.?
- ఒక్కరోజే ఐదు స్మార్ట్‌ఫోన్లు అపహరణ

కేసముద్రం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలో ప్రతీ గురువారం నిర్వహిస్తున్న సంతలో సెల్‌ఫోన్లు మాయమవుతున్నాయి. స్థానిక ఆర్‌వోబీ రోడ్డుకు ఇరువైపులా నిర్వహించిన అంగడిని సమీపంలోని మైదానంలోకి ఇటీవలె మార్చారు. ఈ అంగడిలో 80కి పైగా కూరగాయలు, 20కి పైగా బట్టలు, ఇతర సరుకులు విక్రయించే దుకాణాలు వెరసి 130కి పైగా తాత్కాలిక షాపులను ఏర్పాటు చేస్తుంటారు. కేసముద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, తండాలకు చెందిన వేలాది మంది ప్రజలు ఇక్కడికి వచ్చి కూరగాయలు, పండ్లు, వివిధ రకాల వస్తువులను ప్రతీ అంగడిలో కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో ప్రతీ అంగడిలో మూడు నుంచి ఐదు సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. సంతలో సాధారణ జనంలాగా కొంతమంది కలిసిపోయి ఈ సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్నట్లు పలువురు అనుమానిస్తున్నారు.

నెలలో కొన్ని గురు, శుక్రవారాల్లో సెల్‌ఫోన్లు పోయిన కేసులు కేసముద్రం పోలీస్‌స్టేషన్లో నమోదవుతున్నాయి. తాజాగా ఈనెల 6న నిర్వహించిన సంతలో ఐదు సెల్‌ఫోన్లు పోయిన ఫిర్యాదులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు రావడం గమనార్హం. ఈ ఫోన్లు కూడా ప్రతీ గురువారం కాకుండా మధ్యలో ఒకటి, రెండు వారాల విరామంతో మాయమవుతున్నట్లు తెలుస్తోంది. తక్కువ విలువగల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నవారు ఫిర్యాదు చేయకుండా ఉండిపోతుండగా రూ.10 వేలకు పైగా విలువైన ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. బాగా రద్దీగా ఉన్న దుకాణం వద్ద పైజేబులో పెట్టుకున్న వారి ఫోన్లను క్షణాల్లో మాయం చేస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. వెంటనే ఫోన్‌ను స్విచ్‌ఆఫ్ చేస్తున్నారని బాధితులు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ కె.క్రాంతికిరణ్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సెల్‌ఫోన్ దొంగలపై నిఘా పెట్టి పట్టుకుంటామని, పోయిన ఫోన్లను సాంకేతికతతో రికవరీ చేస్తామని తెలిపారు.



జనం గుంపులుగా ఉన్న ప్రాంతాల్లో సెల్‌ఫోన్లను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇప్పటికైనా సెల్‌ఫోన్ దొంగలను పట్టుకోవాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

కూరగాయలు కొంటుండగా మాయం చేశారు



సంతలో ఫోన్ మాట్లాడి పైజేబులో పెట్టుకొని కూరగాయలు కొనేందుకు పరిశీలిస్తుండగా క్షణాల్లో రూ.30 వేల విలువైన మోటరోలా ఫోన్ కనిపించలేదు. వెంటనే గుర్తించి నా నెంబరుకు మరో ఫోన్ నుంచి కాల్ చేయగా పలుమార్లు రింగ్ అయి ఆ తర్వాత స్విచ్ ఆఫ్ వచ్చింది. ఫోన్ పోయిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశా. గత ఆరేళ్ల క్రితం ఇదే తరహాలో ఈ అంగడిలోనే రూ.40వేల సామ్‌సంగ్ ఫోన్ పోయింది.

\- రామడుగు ధర్మాచారి, కేసముద్రం విలేజి

సైబర్ నేరాలు, పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మానుకోట టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్ క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహబూబాబాద్ టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. మానుకోట జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ఆత్మవిశ్వాసంతో పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలన్నారు. మత్తుపదార్థాలు విక్రయించినా, సేవించినా 100కు ఫిర్యాదు చేయాలన్నారు. నేరాలకు దూరంగా ఉండి సమాజంలో ఎక్కువ మంది ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోవద్దన్నారు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడి ఆర్థికంగా నష్టపోవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే తక్షణమే 1930 టోల్ ఫ్రీనెంబర్‌కు కాల్‌చేసి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. బాల్యం నుంచే నేర రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శివ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

హామీల అమలులో సర్కార్ విఫలం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్



సీఐటీయూ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న కార్మికులకు ఇచ్చిన హామీలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ విమర్శించారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సీఐటీయూ పట్టణ జనరల్ బాడీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశా, గ్రామపంచాయతీ, మునిసిపాలిటీ కార్మికులు, ఐకేపీ వీవోఏలు అనేక సమ్మెలు చేసిన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిల్ ఇస్తామని చెప్పి, ఇవ్వకుండానే నిలిపివేశారని ఆరోపించారు. హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి లేబర్ కార్డులు ఇవ్వాలని, 50 సంవత్సరాలు దాటిన ప్రతీ కార్మికుడికి నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే పరిష్కరించాలని లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న, పాక చంద్రశేఖర్, బిందు, కృష్ణవేణి, పద్మ, దుర్గ, శ్రీనివాసు, మల్లయ్య, ఎల్లయ్య, జనార్దన్, కోటేశ్వరరావు, వెంకన్న, హేమ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వరి పొలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

మరిపెడ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ తాకిడికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ(ఎంఎల్) తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ఉడుగుల లింగన్న డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని భూక్యా తండా జీపీలోని బోడా తండాలో వరి పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని రకాల పంటలను(ధాన్యం, పత్తి, మొక్కజొన్న) ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అధికారులు మాత్రం తేమ శాతాన్ని బట్టి కట్టింగులు విధించి రైతులను ఇబ్బందులు గురిచేయవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుగులోతు చంద్రు, గోంది, బోడి, చంద్రయ్య, వాలి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

పెద్దవంగర, నవంబర్ 8: (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేశ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివా రం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పండ్లు, స్వీట్లును పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరుపేదల అభి వృద్ధికి నిరంతరం కృషిచేస్తూ వారికి అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్ నాయక్, రవీందర్‌రెడ్డి, తోటకురి శ్రీనివాస్, అనపురం శ్రీను, మహేష్, సంపత్, సోమన్న, శేఖర్, సోమనర్సయ్య, పంతులనాయక్, రవి, యాకరాజు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

● తొర్రూరు (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్న నాయకుడు, గొప్ప నేత సీఎం రేవంత్ రెడ్డి అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. శనివారం సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా పట్టణంలోని



పెద్దవంగరలో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మదర్సాలో విద్యార్థులతో కలిసి రేవంత్‌రెడ్డి 56వ జన్మదిన వేడుకల కేక్ కట్ చేసి ఆయన మాట్లాడారు. మదర్సాలో పేద విద్యార్థుల మధ్య రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు మహేందర్, అమీర్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఉచిత బియ్యం సంచుల పంపిణీ



తూర్పుతండాలో రేషన్ కార్డుదారులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సంచులను అందిస్తున్న డీలర్ వెంకన్న

దంతాలపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం అందజేసే ఉచితంగా అందజేసే బియ్యం సంచి పంపిణీ కార్యక్రమా న్ని డీలర్లు చేపట్టారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ లబ్ధిదారులకు నేరుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్‌ను సంచిలో ఇచ్చి పంపిస్తామన్నారు. ప్రతి లబ్ధిదారులకు సంచితో పాటు ఒక్కొక్కరికి ఆరు కిలోల బియ్యాన్ని అందిస్తామన్నారు. ఇటీవల నూతన కార్డులు జారీ చేసిన వారికి సైతం సంచులను ఇస్తున్నట్లు సంబంధిత డీలర్లు పేర్కొన్నారు. దీంతో లబ్ధిదారులు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంచులు పంపిణీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక నుంచి నేరుగా లబ్ధిదారులు రేషన్ షాపుకు వెళ్లి బియ్యంను పొందవచ్చు. మండలంలోని 18 గ్రామాల రేషన్‌కార్డు దారులు ప్రభుత్వంకు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

తొర్రూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పోరాటాల ద్వారానే పెన్షనర్ల సమస్యలు పరిష్కారమవుతాయని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ సెక్రెటరీ టి.సీతారామ్ అన్నారు. శనివారం తొర్రూరులో జరిగిన పెన్షనర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. 2024 మార్చి నుంచి పెన్షనర్లకు రావాల్సిన 5డీఏలు, బెన్‌ఫిట్ అందించకపోవడం సరికాదని, పెండింగ్ మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలని, నగదు రహిత వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ అనంతరం సరైన బెన్‌ఫిట్స్ అందకపోవడంతో కొందరు విశ్రాంత ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 16వ తేదీన మహబూబాబాద్‌లో జిల్లా మహాసభ, 29, 30 వ తేదీల్లో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, ఈ సభల్లో పెన్షనర్ల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజయ్య, కె. వెంకటాచారి, వీరయ్య, నాగేశ్వర్, బందు నారాయణ, బిక్షాజి, కమలమ్మ, చంద్రప్రకాశ్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం నల్లేరుపై నడకే..

● కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవినాయక్

మరిపెడ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం నల్లేరుపై నడకేనని జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్ ఆశాభావం వ్యక్తపరిచారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడారు. గత 10 సంవత్సరాలు బీఆర్ఎస్ పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన వెంటనే 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాడని కొనియాడారు. బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. అంతేకాక రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లీ రఘువీరారెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నరేష్‌నాయక్, నాగనాయక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్ తీవ్రతతో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించేందకు పంటనష్టం సర్వేను పారదర్శంగా నిర్వహించి బాధిత రైతులకు న్యాయం చేయాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మందుల యాకూబ్ అన్నారు. శనివారం నర్సింహులపేట ఆయన మాట్లాడుతూ నర్సింహులపేట మండల వ్యవసాయ అధికారులు పంట నష్టం సర్వేను తూతూమంత్రం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. మొంథా తుపాన్ ప్రభావంతో జయపురం, కౌసల్యదేవిపల్లి, బొజ్జన్నపేట, నర్సింహులపేట, ముంగిమడుగు గ్రామాల్లో వందలాది ఎకరాలల్లో వరి పంట దెబ్బతిన్నదని, బాధిత రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. పంట నష్ట పోయిన రైతులకు అన్యాయం జరిగితే కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షులు కురంది సురేష్, వెంకన్న, రామూర్తి, వీరన్న, బాలు, రమేష్ ఉన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

మరిపెడ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులను ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని కల్లు గీత కార్మిక సంఘం మండల కార్యదర్శి మొగుళ్ల యాకన్న డిమాండ్‌చేశారు. శనివారం మండలంలోని రాంపూర్‌లో ఆయన మాట్లాడారు. కల్లు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మంత్రులకు, విన్నవించినా ఫలితం శూన్యమన్నారు. వినతి పత్రాలు, ఎక్స్‌గ్రేషియా బాధితులే పలుమార్లు జిల్లా కలెక్టర్ కార్యాలయాలు ఎదుట నిరాహార దీక్షలు చేసినా ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. ప్రమాదాలు నివారించడానికి ప్రభుత్వం ఇస్తున్న కాటమయ్య రక్షణ కవచాలు ఏడాది గడిచినా 20 వేలు మించలేదన్నారు. గీత వృత్తి చేసే వారందరికి సేఫ్టీ కిట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గౌడ యువతీయువకులకు ఉపాధి కలిగించే ఆలోచన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే చేయాలన్నారు. చెట్ల పంపకానికి ప్రతి సొసైటీకి 5ఎకరాల చొప్పున భూమి ఇచ్చి, హైబ్రిడ్ తాటి, ఈత వనాలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బొడపట్ల రాజశేఖర్, రాంపూరం బుచ్చిరాములు, రాంపెల్లి ఉపేందర్, సుధగాని సుధాకర్, ఈతగాని పిచ్చయ్య, దొమల సత్యనారాయణ, దొమల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో చెత్త ఎత్తించిన ఉపాధ్యాయులు

● ప్రభుత్వ పాఠశాల వీడియోలు వైరల్

● ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



పాఠశాల ఆవరణలో చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

తొర్రూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తను, గడ్డిని విద్యార్థులతో ఎత్తించిన ఘటన శుక్రవారం తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకున్న వీడియోలు శనివారం స్థానిక వాట్సాప్ గ్రూప్‌లలో వైరల్ అయ్యాయి. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శనివారం ఓ ప్రైవేటు కార్యక్రమం ఉన్న నేపథ్యంలో పాఠశాల హెచ్‌ఎం, పీఈటీలు విద్యార్థులతో గడ్డి తొలగించే పనులు చేయించారు. ఈ వీడియోలు వైరల్ కావడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెల 17వ తేదీన పాఠశాల ఆవరణలో విద్యార్థులు నాణ్యమైన భోజనం అందించాలని ఆందోళన నేపథ్యంలో, యూనిఫామ్ ధరించని విద్యార్థులపై పోలీసు కేసులు పెడతానని హెచ్‌ఎం బెదిరించిన సంఘటనలు ఉన్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కక్షతోనే తమ పిల్లలతో అన్ని పనులు చేయిస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై పీఈటీ ప్రవీణ్ రెడ్డిని వివరణ కోరగా విద్యార్థుల కోరిక మేరకే షటిల్ కోర్టు ఏర్పాటు చేసేందుకు శుభ్రం చేశారని, వారు ఆడుకునేందుకు స్వయంగా పనులు చేసేందుకు ముందుకు వచ్చారని, దీనిని ఈ విధంగా వైరల్ చేయడం సరికాదన్నారు.

మండలంలో 11 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

దంతాలపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 18 గ్రామాలకు గాను 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాముగౌడ్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ పెద్దముప్పారం, కుమ్మరికుంట్ల, రేపోణి, దాట్ల, వేములపల్లి, గున్నేపల్లి, దంతాలపల్లి, బొడ్లాడ, బీరిశెట్టిగూడెం, రామవరంతో పాటు తూర్పుతండాలో ఐకేపీ ఆధ్వర్యంలో మరో కొనుగోలు కేంద్రంను ఏర్పాటు చేశామన్నారు. వారంలోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే సెంటరుకు ఒక్కొక్కటి చొప్పున ధాన్యం క్లీనర్ మిషన్‌లను అందుబాటులోకి ఉంచామన్నారు. రైతులు దళారులకు అమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విచారణలో ఐదు కల్యాణలక్ష్మి దరఖాస్తులు

దంతాలపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి)మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన కల్యాణలక్ష్మి దరఖాస్తులను పరిశీలన చేస్తున్నట్లు తహసీల్దార్ సునీల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే 45 దరఖాస్తులను పరిశీలన చేసి ఆర్డీవో కార్యాలయానికి పంపామన్నారు. మరో 5 దరఖాస్తులను పరిశీలన చేసి ఉన్నతాధికారుకు పంపిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం మంజూరు చేయగానే కల్యాణలక్ష్మి చెక్కులను అందిస్తామన్నారు.

రోడ్డు ఎత్తు పెంచాలని రైతుల నిరసన



వెల్దండ రిజర్వాయర్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

నర్మెట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్దండ, కేశిరెడ్డిపల్లి గ్రామాల మధ్య వెల్దండ శివారులోని తీగలబాయి వద్ద ఉన్న రోడ్డు ఎత్తు పెంచాలని డిమాండ్ చేస్తూ వెల్దండ రైతులు శనివారం నీటిలో దిగి నిరసన వ్యక్తం చేశారు. రైతు వంగ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ వెల్దండ, కేశిరెడ్డిపల్లి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు వెల్దండ రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌తో మునిగిపోతుందన్నారు. తీగలబాయి వద్ద రోడ్డు కిందికి ఉండడంతో రిజర్వాయర్ నీరు రోడ్డుపైకి రావడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయన్నారు. వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రోడ్డు అవతలి వైపు ఉన్న పంట పొలాలు కూడా రిజర్వాయర్ నీటిలో మునిగిపోతున్నాయన్నారు. రిజర్వాయర్‌కట్ట నిర్మించినప్పుడే రోడ్డు ఎత్తు పెంచాలని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు అమర్‌నాథ్, ప్రమోద్‌రెడ్డి, బావనందం, బుషి మోహన్‌రెడ్డి, మంకెన మోహన్‌రెడ్డి, శాతెల్లి తిరుపతి, వంగ సంతోష్‌రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి ఆలయ భూమిపూజ



హోమం నిర్వహిస్తున్న ముదిరాజ్ కులస్థులు

కాటారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్థుల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ శనివారం ఘనంగా జరిగింది. ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో కాటారంలో కమ్యూనిటీ హాల్ పక్కనున్న స్థలంలో శంకుస్థాపన నిర్వహించారు. ఆలయ నిర్మాణం త్వరితగతిన జరగడానికి ఐకమత్యంగా కృషి చేయాలని సంఘం మండల అధ్యక్షుడు ఓలపు రాజబాపు కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల రాజమౌళి, ముదిరాజ్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు చాడ కృష్ణస్వామి, మండల అధ్యక్షుడు రాజబాపు, నాయకులు నాయిని శ్రీనివాస్, జోడు శ్రీనివాస్, జియ్యరి మల్లేష్, బల్ల సమ్మయ్య, సిరిసిల్ల నరేష్, బొంత సంతోష్, జోడు సత్యనారాయణ, అట్లెం పోచయ్య, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రోడ్డు పనులు

● అవస్థలు పడుతున్న ప్రజలు

● ఏడాది గడిచినా పూర్తికాని ఫోర్‌లేన్



గుంతలతో అసంపూర్తిగా ఉన్న రహదారి

కాటారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది వాహనాలు తిరిగే కాటారం-మంథని రహదారిని ఫోర్ లేన్ రోడ్డుగా మారుస్తూ చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. దీంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కొద్ది దూరం బాగానే ఉన్నా రోడ్డుపై చాలా చోట్లా గుంతలు, అసంపూర్తిగా ఉన్న డివైడర్‌తో ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభు త్వం హయాంలో రోడ్డు విస్తరణ పనుల కోసం నిధులు మంజూరు కాగా కాం ట్రాక్టర్లు పనులు ఆలస్యంగా ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో కాటారం-పెద్దపల్లి రహదారిని జాతీయ రహదారి గా మార్చే ప్రతిపాదనలు చేసినప్పటికీ మంజూరు కాలేదు. దీంతో ప్రభుత్వం ఇదే రోడ్డును సెంట్రల్ డివైడర్‌ను ఏర్పాటు చేసి ఫోర్ లేన్ రోడ్డుగా విస్తరించడానికి ప్రతిపాదించారు. దీంతో గత ఏడాది జూన్‌లో రహదారి విస్తరణ పనులు మొదలయ్యాయి. సబ్ కాంట్రాక్ట్ నిర్వాహకులు పనులు చేపట్టా రు. పనులు సరిగా చేపట్టకపోవడం, సకాలంలో చేయకపోవడంతో రోడ్డు పనులు అసంపూర్తిగా మిగిలాయి.

ధన్వాడ సమీపంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం జరగాల్సి ఉన్నా కార్యరూపం దాల్చలేదు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేని తనం కారణంగా రహదారి విస్తరణ పనులు కొన్ని నెలలుగా ఆగిపోయాయి. మంజూరైన నిధులతో మండల కేంద్రం నుంచి సుమారు 7 కిలోమీటర్ల మేర పను లు చేపట్టి ఏడాది గడిచినా పూర్తికాక పోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్రఇక్కట్లు పడుతున్నారు. రహదారి విస్తరణ పనులు పూర్తికాకుండానే కొన్ని చోట్ల సెంట్రల్ డివైడర్ నిర్మాణం జరగడంతో వాహనాలు రెండు వరసల్లో వెళ్లే అవకాశం లేకుండా పోయింది. కల్వర్ట్ నిర్మాణం సరిగా చేయకపోవడం, డివైడర్‌మధ్యలో నీరు నిలవడం, రోడ్డు నిర్మాణంలో నాణ్యతా లోపంతో పలు చోట్ల కుంగిపోయి వాహనాలు జంపింగ్ చేస్తున్నాయి. చిన్న కార్లు, బైకులు వేగంగా వెళ్తే ఎగిరి బోల్తాపడే ప్రమాదం ఉంది. రహదారి సక్రమంగా లేక పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోవడం, గాయపడటం లాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నా రు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మా ణం నాణ్యతతో పూర్తి చేయించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గురుకులం విద్యార్థులు



చంటి



అజయ్

కాటారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వరంగల్‌లో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ఐ హ్యాండ్‌బాల్ అండర్-17 పోటీల్లో విద్యార్థులు ఎం.చంటి, బి.విజయ్ ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎస్‌జీఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి జైపాల్ తెలిపారు. మహబూబ్‌నగర్‌లో ఆదివారం జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని వెల్లడించారు. గురుకులం నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్స్ మాధవి, వెంకటయ్య, పెటా జిల్లా అధ్యక్షుడు సిరంగి రమేష్, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్ అభినందించారు.

15 లీటర్ల గుడుంబా పట్టివేత

ఏటూరునాగారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ నుంచి ఏటూరునాగారం మండలం రొయ్యూరుకు గుడుంబాను రవాణా చేస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. వాసం రవిశంకర్ అనే వ్యక్తి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని తార్లగూడెం నుంచి రొయ్యూర్‌కు మోటార్ సైకిల్‌పై గుడుంబా తీసుకొస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు నిఘా పెట్టారు. ఏటూరునాగారం ఎస్సై ఎన్.రాజ్‌కుమార్, రెండో ఎస్సై నరేష్ సిబ్బందితో కలిసి రొయ్యూరు మార్గంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. మోటార్ సైకిల్‌పై వస్తున్న రవిశంకర్‌ను ఆపి, అతని వద్ద ఉన్న 15 లీటర్ల గుడుంబాను పోలీసులు పట్టుకున్నారు. గుడుంబా రవాణాకు ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

పాముకాటుతో బాలుడి మృతి



హరినాథ్ (ఫైల్)

కన్నాయిగూడెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాము కాటుతో బాలుడు మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గుర్రేవులకు చెందిన తిరునగిరి రాజు-సంగీత దంపతులకు ముగ్గురు సంతానం. చిన్న కుమారుడు హరినాథ్(7) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. రెండో శనివారం కావడంతో పాఠశాలకు సెలవు ఉండగా తోటి పిల్లలతో ఆరుబయటే హరినాథ్ ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో పాము కాటు వేయగా అతడు అరవడం మొదలెట్టారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తమ వద్ద పాముకాటుకు మందులు లేవని చెప్పడంతో 108 ద్వారా ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యం అందించే క్రమంలోనే బాలుడు మృతి చెందాడు.

ఓటరు సవరణకు ఎస్ఐఆర్

- 2002, 2025 ఓటరు జాబితాలతో మ్యాచింగ్ ప్రక్రియ పూర్తి
- మ్యాచింగ్ కాని ఓట్ల తొలగింపునకు కసరత్తు
- త్వరలోనే ఇంటింటి సర్వే
- సరైన పత్రాలు చూపకుంటే ఓటు తొలగింపే..



వర్ధన్నపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే తెలంగాణలో ఈ కార్యక్రమం చేపట్టగా మొదటి దశ మ్యాచింగ్ కార్యక్రమం పూర్తయింది. త్వరలోనే ఇంటింటి సర్వే చేసి ఓట్ల సవరణ చేయనున్నారు. జిల్లాలో బీఎల్‌వోలు త్వరలోనే మ్యాచింగ్ కాని ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఓట్లు ఎలా పొందారో దానికి కావాల్సిన పత్రాలను ఓటర్ల నుంచి స్వీకరించనున్నారు. సరైనా పత్రాలు సమర్పించని ఓటర్లను జాబితా నుంచి తొలగించనున్నారు. బిహార్ రాష్ట్రంలో మాదిరిగానే తెలంగాణలోనూ ఎస్ఐఆర్ కార్యక్రమం పేరిట ఓటర్ల జాబితా సవరణ చేస్తున్నారు.

2002,2025 జాబితాల్లో ఓట్లు ఉంటే ఓకే..

2002, 2025 ఓటరు జాబితాల్లో ఓటు హక్కు కలిగి ఉంటేనే వారు స్థానికులుగా దేశ పౌరులుగా గుర్తించనున్నారు. 2025 ఓటరు జాబితాలో మాత్రమే ఓటు హక్కు ఉంటే ఆ ఓటరు జాబితాలో మాత్రమే ఓటు హక్కు ఉంటే ఆ ఓటరు ఎలా ఓటు హక్కు పొందారో నిరూపించుకునేందుకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. 2002లో ఓటు హక్కు ఉండి ఇప్పుడు లేని వారి వివరాలను సేకరించి వారు ఎక్కడికి వెళ్లారు. ఎక్కడ ఉన్నారు అనే వివరాలు కూడా ఆరా తీయనున్నారు. జాబితాలో ఎవరైనా చనిపోయినా, ఇతర దేశాలకు వలస వెళ్లినా వారి ఓట్లు ఉంటే గుర్తించి తొలగించనున్నారు.

18 నుంచి 38 ఏళ్ల వయస్సు మధ్య గుర్తింపు

2002 ఓటరు జాబితాలో 18ఏళ్ల నుంచి 38 ఏళ్ళ వయస్సు గల ఓటర్లను గుర్తించారు. 2002లో 18ఏళ్లు ఉన్నట్లయితే 2025 నాటికి వారికి 43ఏళ్ల వయస్సు ఉంటుంది. అప్పుడు 38 ఏళ్లు ఉన్నట్లయితే ఆ ఓటరు ఇప్పుడు 61 ఏళ్ల వయస్సు ఉంటుంది. అలాంటి వారిలో ఎవరైనా చనిపోతే వారి ఓట్లను తొలగిస్తున్నారు. ఓట్లు ఉన్న వారు ఇపుడు ఓటరుగా ఉన్నారా? లేదా? పరిశీలిస్తున్నారు. 2002 తరువాత నమోదైన ఓటర్లను స్థానికేతరులుగా గుర్తించి వారి పుట్టిన ప్రాంతం, నివాస ప్రాంతంపై ఆరా తీయనున్నారు. పుట్టిన ప్రాంతం, నివాస స్థలం, తల్లిదండ్రులు, తాత ముత్తాతల స్థానికతపై ధ్రువీకరణ పత్రాల ద్వారా నిర్ధారణ చేయనున్నట్లు సమాచారం.

మొదటి దశ ప్రక్రియ ఇలా..

మొదటి దశలో 2002, 2025 ఓటరు జాబితాను దగ్గర ఉంచుకోని అందులో ఓటరు మ్యాచింగ్ చేపట్టారు. ఆ మ్యాచింగ్ ప్రక్రియ ఇటీవల ముగియడంతో ఆ నివేదికను అధికారులు ఎన్నికల కమిషన్‌కు సమర్పించారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 30 నుంచి 40 శాతం ఓట్లు మాత్రమే మ్యాచింగ్ అయినట్లు సమాచారం. మిగిలిన ఓటర్లు స్థానికులా... కాదా. అని గుర్తించేందుకు బీఎల్‌వోలు సర్వే చేయనున్నారు. ఈ సర్వేలో ఓటర్లు తమ ఓటు హక్కు ఎలా పొందారో సంబంధిత స్థానిక ధ్రువీకరణ పత్రాలు అందజేసి నిరూపించుకోవాల్సి ఉంటుంది. త్వరలోనే అన్ని నియోజకవర్గాల్లో ఇంటింటి సర్వే చేపట్టి ఓట్ల సవరణ చేయనున్నారు. అలా జరిగితే ప్రతి నియోజకవర్గం లోనూ 20 నుంచి 30 శాతం ఓటర్లను జాబితా నుంచి తొలగించే అవకాశం కనిపిస్తుంది. సరైన ధ్రువీకరణ పత్రాలు చూపించని వారిని ఓటరు జాబితా నుంచి తొలగించి వారికి దేశ పౌరసత్వం లేనివారిగా ప్రకటించే అవకాశం ఉంది.



ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటిస్తాం..
అనిఫ్, డిప్యూటీ తహసీల్దార్, వర్ధన్నపేట

ఓటరు జాబితా ప్రకాశన విషయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటిస్తాం. ప్రస్తుతం 2002, 2025 ఓటరు జాబితాలను స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేశాం. రెండు జాబితాల్లో ఉన్న ఓటర్ల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదించాం. తదుపరి ఎన్నికల కమిషన్ ఆదేశాలను అమలు చేస్తాం.

ఎంజీఎం, సీకేఎం సేవలపై దృష్టి ఏదీ ?

- ఇద్దరు మహిళా మంత్రులు ఏం చేస్తున్నారు ?
- ప్రజా సమస్యలపై యాక్షన్ ప్లాన్ రూపొందిస్తాం..
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత


తనకు స్వాగతం పలుకుతున్న వారితో కోలాటం ఆడుతున్న కల్వకుంట్ల కవిత

వరంగల్ మెడికల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ, వరంగల్ జిల్లాలే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఎంజీఎం ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. తెలంగాణ జాగృతి జనం బాటలో భాగంగా శనివారం మధ్యాహ్నం కవిత ఎంజీఎం ఆస్పత్రిల్లోని అత్యవసర విభాగం ఎమర్జెన్సీ ల్యాబ్, సిటీస్కాన్ విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంజీ ఎం ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి...? ఇంకా ఎలాంటి కొరత ఉన్నాయనే విషయాలను పరిపాలనాధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఎంజీఎం ఆస్పత్రి ఏమాత్రం మెరుగుపడలేదన్నారు. పెరిగిన రోగుల రద్దీకి అనుగుణంగా ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కలెక్టర్ వెంటనే ఆస్పత్రుల్లో సౌకర్యాల లేమిపై దృష్టి సారించాలని కోరారు. ఉమ్మడి జిల్లా నుంచి మహిళా మంత్రులైన సీతక్క, కొండా సురేఖలకు పేద ప్రజల ఆరోగ్యం శ్రద్ధ లేదని కవిత ఆరోపించారు. ప్రసూతి ఆస్పత్రి నిర్వహణ మరింత దిగజారిపోయిందన్నారు. ఎంజీఎం ఆస్పత్రి సమస్యలపై కలెక్టర్‌తో మాట్లాడతామని, అయినా మార్పు రాకపోతే యాక్షన్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంజీఎం ఆర్ఎంవో శశికుమార్, జాగృతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వీధి రౌడీలా మాట్లాడడం సరి కాదు

కాజీపేట (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల కోసం నిలబడి, కాలేజీ యాజమాన్యాల తరఫున పోరాడుతామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి జనంబాటలో భాగంగా కాజీపేట ఫాతిమానగర్‌లో శనివారం కవితకు జాగృతి నేతలు బతుకమ్మలు, కోలాటంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. కళాశాల యాజమాన్యాలతో సీఎం రేవంత్ రెడ్డి వీధిరౌడీలా మాట్లాడడం సరియైంది కాదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం తాను కౌన్సిల్ లో మాట్లాడితే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారన్నారు. కాలేజీ యాజమాన్యాలు లోన్ తీసుకుని, డబ్బులు కూడబెట్టి కాలేజీలు నిర్మించారన్నారు. కాలేజీ యాజమాన్యాలకు ఇబ్బందులు వస్తే తాను వారి తరఫున పోరాడుతామన్నారు. కాలేజీ యాజమాన్యాలు కూడా విద్యార్థుల చదువుకు భంగం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.


కేయూ క్రాస్ రోడ్డు వద్ద నిరుద్యోగులతో మాట్లాడుతున్న కవిత

నిరుద్యోగులు సమస్యలపై పోరాడాలి
కేయూ విద్యార్థులతో కవిత 'చాయ్‌పే చర్చ'

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత తమ సమస్యలపై పోరాడాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. శనివారం రాత్రి కేయూ క్రాస్‌రోడ్డులో జనంబాటలో భాగంగా కల్వకుంట్ల కవిత 'చాయ్ పే చర్చ' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కేయూ నిరుద్యోగ యువతతో కవిత మాట్లాడి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇస్తామని భావించినప్పటికీ ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించిన ఉద్యోగాలిచ్చి తామే ఇచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగుల తమ సమస్యలతో పాటు జోనల్ వ్యవస్థ అంశాలపై పోరాడాలని ఆమె కోరారు. రాష్ట్రంలో అధికారం మారితేనే నిరుద్యోగ యువత జీవితాల్లో మార్పు వస్తుందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తానని కవిత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లింగుదారి రాజేశ్వర్‌రావు, మంద భాస్కర్, వర్సిటీ విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

సర్జికల్ కేర్‌పై సరైన శిక్షణ అవసరం
కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీ పి.వి. నందకుమార్‌రెడ్డి

వరంగల్ మెడికల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలో సర్జికల్ కేర్‌పై బోధనా సిబ్బందితో పాటు విద్యార్థులకు సరైన శిక్షణ ఇవ్వడం అవసరమని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ వీసీ పి.వి.నందకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని కాళోజీ కళా క్షేత్రంలో తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా 11వ వార్షిక సదస్సు రెండో రోజు జరిగింది. ఇందులో భాగంగా ముఖ్య అతిథిగా వీసీ నందకుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం నూతన ప్రణాళికల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య అనిల్, నర్సంపేట జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, డాక్టర్ ఉమాకాంత్‌గౌడ్, డాక్టర్ నరేష్ కుమార్, డాక్టర్ అప్పాల సుధాకర్, డాక్టర్ సిద్ధార్థ్, డాక్టర్ రాజ్యలక్ష్మీగోదాదేవి, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ నాగార్జునరెడ్డి, డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ ఎస్‌వీవీరెడ్డి, డాక్టర్ కూరపాటి రమేష్, డాక్టర్ నాగేందర్, డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ నందకుమార్‌రెడ్డి తదితరులు

బానిస బతుకులు

- గ్రానైట్ కటింగ్ పరిశ్రమల్లో పని చేస్తున్న వందలాది మంది ఇతర రాష్ట్రాల కార్మికులు
- వసతులు కల్పించడంలో కంపెనీల నిర్లక్ష్యం
- వెట్టి చాకిరి చేయించుకుంటున్న నిర్వాహకులు
- పర్యవేక్షణ లేని కార్మిక శాఖ అధికారులు

ఎల్కతుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బతుకు దెరువు కోసం వచ్చిన వలస కార్మికులు గ్రానైట్ కటింగ్ కంపెనీల్లో బానిస బతుకులు బతుకుతున్నారు. శ్రమకు తగిన వేతనం చెల్లించకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. కార్మిక చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు కంపెనీలు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తి పడి వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. గాయాలైనా, అనారోగ్యానికి గురైన కార్మికుని ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. వైద్య ఖర్చులు భరించ లేక, తిరిగి స్వస్థలానికి వెళ్లలేక వలస కూలీలు దుర్భర జీవితాలు గడుపుతున్నారు.

వందలాది మంది..

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల పరిధిలో ఉన్న 40 గ్రానైట్ కటింగ్ కంపెనీల్లో సుమారు ఎనిమిది వందల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో బీహార్, జార్ఖండ్, కర్ణాటక, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, అస్సాం, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్, హర్యానా, అరుణాచల్‌ప్రదేశ్, నేపాల్, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు కంపెనీల్లో పనిచేస్తున్నారు. అమవాస్య రోజు మినహా ప్రతి రోజు 24 గంటల పాటు గ్రానైట్ కటింగ్ నిరంతరాయంగా నడుస్తూనే ఉంటాయి. కార్మిక చట్టాల మేరకు షిఫ్టుల వారీగా పని చేయించుకోవాల్సిన పరిశ్రమల నిర్వాహకులు కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారు. ఒకే వ్యక్తిచే రాత్రి పగలు విరామం లేకుండా పనులు చేయించుకుంటున్నట్లు పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీ గ్రామంలో వలస కార్మికులే..

వ్యవసాయానికి నాట్లు వేయడంతో పాటు రైసు మిల్లుల్లో, గ్రానైట్ కటింగ్ కంపెనీల్లో, ఇటుక బట్టీల్లో, భవన నిర్మాణాల్లో ఎక్కడ చూసినా ప్రతి గ్రామంలో వలస కూలీలు అధిక మొత్తంలో ఉన్నారు. వారికి ఉపాధి కావలసినంత దొరుకుతుంది. ఈ ప్రాంత ప్రజలకు సైతం పనుల్లో ఊరట కలుగుతోంది. కానీ ఎప్పుడు వస్తారో తెలియదు, ఎప్పుడు చెప్పపెట్టకుండా వెళ్తారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల కొందరు కార్మికులకు ముందుగా యజమాని నుంచి డబ్బులు ఎక్కువగా ముట్టగానే మరుసటి రోజు అతడి ఆచూకీ లభించడం లేదు. చెప్ప పెట్టకుండా రాత్రికి రాత్రే ఉడాయిస్తున్నారు.


ఎల్కతుర్తిలో ఆరు బయట నిద్రిస్తున్న వలస కార్మికులు

వసతులు కరువు

పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు కనీస వసతులు కల్పించాల్సిన నిర్వాహకులు కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేస్తున్నారు. దేశంలోని కార్మిక చట్టాల ఆధారంగా వేతనాలు చెల్లించడం లేదు. 8 గంటలకు మించకుండా పనులు చేయించుకోవాల్సిన పరిశ్రమల నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. పని చేసే సమయంలో ఎలాంటి అనారోగ్యానికి గురైనా భద్రత చర్యలు పాటించకుండా వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. వార్షిక సెలవులు ఇవ్వకుండా సంవత్సరం పాటు బలవంతపు పనులు చేయించుకుంటున్నారు. కార్మికుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కార్మికులకు అందించాల్సిన ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, బోనస్ డబ్బులు చెల్లించకుండా కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు. పని చేసే చోట ఉండటానికి సరైన నివాస వసతులు కల్పించడం లేదు. ఇరుకు గదిలో నివసిస్తూ దుర్భర జీవితాలు గడుపుతున్నారు. ఎలాంటి కార్మిక సంఘాలతో సంబంధం లేకపోవడంతో పరిశ్రమల నిర్వాహకులు చెప్పిన పనులే కార్మికులకు శాసనంగా మారాయి.

మొద్దు నిద్రలో కార్మిక శాఖ

కార్మిక చట్టాలను ఉల్లంగిస్తున్న పరిశ్రమలపై ఉక్కు పాదం మోపాల్సిన కార్మిక శాఖ అధికారులు నిర్వాహకులు ఇచ్చే మామూళ్లతో మొద్దు నిద్రలో ఉంటున్నారు. కార్మికులకు చట్ట ప్రకారం వేతనాలు చెల్లించకుంటే జరిమానాలు విధించాల్సిన అధికారులు మచ్చుకైన జరిమానాలు విధించిన దాఖలాలు లేకుండా పోయాయనే ఆరోపణలున్నాయి. కార్మికులకు ప్రమాదకరంగా హాని కలిగే పరిస్థితులున్నా చర్యలు తీసుకోవడం లేదు. వెట్టి చాకిరి చేయిస్తున్న పరిశ్రమలకు చెందిన బిజినెస్ లైసెన్స్‌ను రద్దు చేసే అధికారం ఉన్నప్పటికీ డబ్బు మూటలు ముట్టేసరికి చోద్యం చూస్తున్నారు. పరిశ్రమల్లో గాయపడిన, మృతి చెందిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించకపోయిన అధికారులు పట్టించుకోవడం లేదు. కార్మిక శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గ్రానెట్ పరిశ్రమల నిర్వాహకులకు శ్రమ దోపిడీకి అద్దు అదుపు లేకుండా పోయింది.

కారు బోల్తా


బోల్తా పడి నుజ్జునుజ్జయిన వాహనం

యువకుడి దుర్మరణం

పర్వతగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కారు బోల్తా పడి యువకుడు దుర్మరణం చెందిన ఘటన మండలంలోని ఏనుగల్లు గ్రామ శివారులో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు గ్రామానికి చెందిన షేక్ సాహెల్ (23) సంగెం మండలంలోని గవిచర్ల గ్రామంలో వారి బంధువుల వివాహానికి హాజరై తిరిగి వెళ్తుండగా తాను ప్రయాణిస్తున్న హుండాయ్ వెన్యూ కారును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో పల్టీలు కొడుతూ రోడ్డు పక్కన పడిపోయింది. ఇంజను ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో సాహెల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి యాకూబ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి సాహెల్ మృతదేహాన్ని తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.


షేక్ సాహెల్ (ఫైల్)

ముగిసిన జోనల్ క్రీడలు

విజేతలకు బహుమతులు అందజేత

రాయపర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో ఈ నెల 6 నుంచి ప్రారంభమైన 11వ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు శనివారం కోలాహలంగా ముగిశాయి. చివరి రోజు క్రీడా పోటీలు ఉత్సాహంగా జరగ్గా, గెలుపొందిన క్రీడాకారులకు ప్రిన్సిపాల్ సరిత బహుమతులను ప్రదానం చేశారు. అథ్లెటిక్స్ అండర్-14 విభాగంలో తొర్రూరుకు చెందిన సంకీర్తన, అండర్-17లో మడికొండకు చెందిన చందనశ్రీ, అండర్-19 విభాగంలో మహబూబాబాద్‌కు చెందిన అశ్విని గెలుపొందారు. అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్ షిప్‌లో అండర్-14లో తొర్రూరు, అండర్-17లో మడికొండ, అండర్-19లో మడికొండ పాఠశాలలు ఎంపికయ్యాయి. గేమ్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో అండర్-14లో రాయపర్తి, అండర్-17లో పరకాల, అండర్-19లో రాయపర్తి ఉన్నాయి. గేమ్స్ అండర్ అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో అండర్-14, 17, 19లో రాయపర్తి నిలిచింది. ఖో-ఖో, కబడ్డీ, చెస్, క్యారమ్స్, హ్యాండ్‌బాల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్‌తో పాటు జ్ఞాపికలను అందించారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ సరిత, టీచర్లు

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సరిత మాట్లాడుతూ 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్ ఎంతో విజయవంతంగా ముగిసిందని తెలిపారు. 14 పాఠశాలల నుంచి 1,190 మంది విద్యార్థులు పాల్గొన్నారని, క్రీడా పోటీల్లో వారి స్ఫూర్తిని ప్రదర్శించడం గర్వకారణమని తెలిపారు. ఈ క్రీడా పోటీలకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలియచేశారు.

రోడ్డు బాగా లేదని బస్సు ఆపేశారు..

- రాగంపేట, రంగాపురం, కొత్తూరుకు బస్సు బంద్
- ఎమ్మెల్యే దొంతి చొరవతో రోడ్డుకు మరమ్మతు
- అయినా పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న మూడు గ్రామాల ప్రజలు

ఖానాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేట, కొత్తూరు, రంగాపురం గ్రామాల మీదుగా వెళ్లే బస్సు సర్వీసు బంద్ అయి ప్రజలు అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాలకు మండల కేంద్రం నుంచి ఈ మూడు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో నాలుగు నెలల కిందట ఆ గ్రామాలకు అప్పటి వరకు ఉదయం, సాయంత్రం నడిచిన షటిల్ సర్వీస్ బస్సును ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నెల కిందట గుంతలమయమైన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు చేయించారు. దీంతో నాటి నుంచి వాహన రాకపోకలకు ఇబ్బందులు తప్పాయి. కానీ, ఆర్టీసీ అధికారులు మాత్రం ఇప్పటివరకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించలేదు.


మరమ్మతు చేపట్టిన రోడ్డు

రోజూ రాకపోకలు

రాగంపేట, కొత్తూరు, రంగాపురం గ్రామాల్లో 8 వేలకు పైగా జనాభా ఉంటుంది. నిత్యం ఆయా గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు వస్తుంటారు. వీరు నర్సంపేటలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు వెళ్తుంటారు. అలాగే వీరితో పాటు మహిళలు, ప్రైవేట్ ఉద్యోగులు, రైతులు వివిధ పనుల నిమిత్తం వందలాది మంది ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. నాలుగు నెలలుగా బస్సు సౌకర్యం నిలిపివేయడంతో వారంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆర్టీసీ అధికారులకు మొర

ఈ గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఆయా గ్రామాల వాసులు, విద్యార్థులు పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల విద్యార్థులు, గ్రామస్థులు ఆర్టీసీ డీఎంను కలిసి వినతిపత్రం ఇవ్వబోగా ఆమె తీసుకోవడానికి నిరాకరించిందని విద్యార్థులు తెలిపారు. ఆర్టీసీ అధికారులు వచ్చి రోడ్డును పరిశీలించాక బస్సు సౌకర్యం కల్పించాలా ? వద్దా ? అనే విషయం ఆలోచిస్తామని డీఎం అన్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. ఇలా చెబుతూ తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు..
బంధారపు శ్రీనివాస్‌గౌడ్, రంగాపురం



రాగంపేట, కొత్తూరు, రంగాపురం గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులకు కలిసి విన్నవించాం. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. డీఎం రూట్ పరిశీలన చేయాలన్నారు. దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా బస్సు సౌకర్యం కల్పించాలి.

ఎమ్మెల్యే స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి
శౌంతి విఘ్నేష్, బీటెక్ విద్యార్థి, కొత్తూరు



గతంలో ఉదయం, సాయంత్రం కళాశాల సమయానికి బస్సు నడవడంతో బస్సులోనే నర్సంపేటకు వెళ్లి వచ్చేవాళ్లం. బస్సు సౌకర్యం నిలిపివేయడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల డయల్ యువర్ డీఎం ప్రోగ్రాంలో ఈ విషయాన్ని డీఎం దృష్టికి తీసుకెళ్లాం. అయినా పట్టించుకోవడంలేదు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పందించి మాకు బస్సు సౌకర్యం కల్పించాలి.

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

● కేక్ కట్‌చేసిన కాంగ్రెస్ శ్రేణులు

● బాణాసంచా కాల్చిన కార్యకర్తలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధి బోరబండ డివిజన్‌లోని కార్మికనగర్‌లో మానుకోట ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ నేతృత్వంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ తరఫున బోరబండ డివిజన్‌లో స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్, మానుకోట కాంగ్రెస్ నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బోరబండ డివిజన్‌లోని కార్మికనగర్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమక్షంలో సీఎం జన్మదిన వేడుకలు నిర్వహించి, మాట్లాడారు. ముఖ్యమంత్రి అనేక ప్రజాసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో నిలిచారని చెప్పారు. ఈ కార్యక్రమంలోయూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కంకర అయ్యప్పరెడ్డి, మానుకోట జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, స్వర్ణలత పాల్గొన్నారు.

● నెల్లికుదురు : మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో కాంగ్రెస్ కార్యకర్తలు రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పంపిణీ చేశారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో బాణాసంచాలు పేల్చి సంబరాలు నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, మండల అధ్యక్షుడు గొల్లపెల్లి ప్రభాకర్‌గౌడ్, వలబోజు వెంకటేశ్వర్లు, హెచ్ రవి, హెచ్ అలివేలు, శ్రీపాల్‌రెడ్డి, గోగుల మల్లయ్య, జగన్, ఆకుల నర్సయ్య, కొముల్లెల్లి, అరుణ్ ఇటి దేవేందర్‌రెడ్డి, యాసం యాకయ్య, జిలుకర యాలాద్రి, బాలాజీనాయక్, పులి వెంకన్న, మంద రవి వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

● డోర్నకల్ : రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గాంధీ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుమీర్‌చంద్ జైన్ మాట్లాడారు. నాయకులు మాజీ మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, మాద శ్రీనివాస్, కోటిలింగం, ఎల్లావుల హరికృష్ణ, శీలం శ్రీనివాస్, రెడ్డబోయిన శంకర్, మావిడి నాగరాజు, ఎస్‌కె. ఖాసీం, రాము, ప్రవీన్ బాబు, దాసరి నాని, దరావత్ కృష్ణ, పచ్చిపాల గోపి, ప్రవీన్‌పన్నారియా, దోమల లక్ష్మణ్, ఉపేందర్, హబీబ్, మున్నా, రెడ్డబోయిన బాస్కర్ పాల్గొన్నారు.

● గార్ల : గార్లలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సమీపంలో రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి కృష్ణాగౌడ్, శ్రీశక్తి అవార్డు గ్రహీత షంషాద్ బేగం కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలోమాజీ పీసీసీ సభ్యుడు రావూరి వెంకట్రామయ్య, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి, పల్లా నర్సయ్య, యాకుబ్ పాషా, పాల్గొన్నారు.

● ఇనుగుర్తి : ఇనుగుర్తి పెద్దబస్టాండ్ సెంటర్‌లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు గంజి రాజేందర్‌రెడ్డి, బైరు అశోక్, కొట్టం రాము, చిన్నాల కట్టయ్య, భూక్య వెంకన్న, కొలిపాక నారాయణ, వల్లంల మురళి, కుంచాల రమేష్, మలిశెట్టి శ్యాం, చరణ్, గందు అంజయ్, సూర్య, మామిడి జనార్ధన్ పాల్గొన్నారు.

● కేసముద్రం : కల్వలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ మహిళా కార్యకర్తలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తికి ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, గండి శ్రీనివాస్, గుగులోత్ దస్రూనాయక్, బండారు వెంకన్న, రావుల మురళి, గంట బాలకృష్ణారెడ్డి, రాంమోహన్‌రెడ్డి, బొడ్డు భిక్షం, యుగెందర్, దినేష్, గంట కవిత, శిరీష, అనూష తదితరులు పాల్గొన్నారు.

● కొత్తగూడ : కొత్తగూడలో రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి కేక్‌కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలు బాంబులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రూరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా నారాయణరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కర్ర జనార్ధన్‌రెడ్డి, డీసీసీ సభ్యుడు వీరనేని వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, మాజీవైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, మండల నాయకులు బోయినేనీ ప్రశాంత్‌రెడ్డి, వల్లెపు రంజిత్, నేముల ప్రశాంత్ యాదవ్ పాల్గొన్నారు.


ఇనుగుర్తి పెద్దబస్టాండ్ సెంటర్‌లో


కేసముద్రం మండలం కల్వలలో


కొత్తగూడ మండల కేంద్రంలో


గార్ల పట్టణ కేంద్రంలో


డోర్నకల్ గాంధీసెంటర్‌లో రేవంత్‌రెడ్డి జన్మదిన కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


నెల్లికుదురులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు


బోరబండలోని కార్మికనగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న మానుకోట ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్

చెరువు నీటిలో మునిగిన పొలాలు

కేసముద్రం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహమూద్ పట్నంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కారణంగా ఆ గ్రామ చెరువు సమీపంలోని నలుగురు రైతులకు చెందిన ఐదెకరాల పొలాలు పూర్తిగా నీళ్లలో మునిగినట్లు బాధితులు తెలిపారు. బాధిత రైతుల్లో ఒకరైన గుగులోత్ రాంజీ శనివారం మాట్లాడారు. 40 ఏళ్ళుగా సాగు చేసుకుంటున్న పట్టా భూముల్లోని పొలాలు చెరువునీటిలో కొద్దిరోజులుగా మునిగిపోయాయని తెలిపారు. చెరువునకు మరోవైపు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా సరైన ప్రణాళిక లేకుండా అడ్డుగా కట్ట నిర్మించడంతో చెరువు నీళ్ల తమ భూముల వైపునకు వచ్చాయని తెలిపారు. కోతకు వచ్చిన వరిపొలాలు నీళ్లలో మునిగి పూర్తి నష్టపోయామని, భవిష్యత్తులో కూడా ఏ పంటలు సాగు చేయని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.


మహమూద్‌పట్నంలో చెరువు నీటిలో మునిగిన వరి పొలాన్ని చూపిస్తున్న రైతు గుగులోత్ రాంజీ

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నేత యాదనాయక్

నెహ్రూసెంటర్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి) : వైద్య, ఆరోగ్య ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ యూనైటెడ్ మెడికల్‌అండ్‌హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదనాయక్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో తెలంగాణ యూనైటెడ్ మెడికల్‌అండ్‌హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా మహాసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖలో దశాబ్ధాల తరబడి పని చేస్తున్న పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఏఎన్‌ఎంలకు పని భారం తగ్గించాలని కోరారు. రాత పరీక్ష పూర్తయి పెండింగ్‌లో ఉన్న 2,246 ఏఎన్‌ఎం పోస్టులు, 2,300 నర్సింగ్ ఆఫీసర్లు, 1,284 ల్యాబ్ టెక్నీషియన్లు, 735 ఫార్మసిస్ట్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈనెల 14న సంగారెడ్డిలో జరిగే సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



మహాసభలో మాట్లాడుతున్న యాదనాయక్

జిల్లా నూతన కమిటీ ఎన్నిక..

మహబూబాబాద్‌లో తెలంగాణ యూనైటెడ్ మెడికల్‌అండ్‌హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభ అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.రవీందర్, అధ్యక్షుడిగా డి.జ్యోతి, ఉపాధ్యక్షులుగా విజయ, సరిత, నసీమా, ప్రధానకార్యదర్శిగా బి. శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా పి.వెంకన్న, కార్యదర్శులుగా నాగలక్ష్మి, నీలమ్మ, వీరలక్ష్మి, కోశాధికారిగా ఎం.సువర్ణ, కార్యవర్గ సభ్యులుగా ప్రేమలత, మాధవి, రజిత, సుకన్య, పార్వతి, సునిత ఎన్నికయ్యారు. ఈ సభలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె. సుధాకర్, ఎం.కిషన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, అరుణ. జ్యోతి, వసంత రాజశ్రీ, శివరాణి, సమ్మక్క, కమల పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

కొత్తగూడ, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాల పాలైన సంఘటన కొత్తగూడలో శనివారం జరిగింది. వివరాల ప్రకారం. గంగారం మండలం మడగూడెం గ్రామానికి చెందిన కల్తి రమేష్ కుమారుడు కుమార్ కొత్తగూడ నుంచి కొత్తపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా బూరుగుగుంపు వద్దట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో కుమార్ తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన యువకుడిని 108లో నర్సంపేటలోని గవర్నమెంట్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

బయ్యారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు జరిగిన విద్యుదాఘాతంతో ఓ ఇల్లు దగ్ధమవగా, రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. ఈ ఘటన శనివారం లింగిగిరి తండాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. తండాకు చెందిన బోడా స్వామి తన భార్యతో కలిసి రోజువారి మాదిరిగానే శనివారం ఉదయం పొలం పనులకు వెళ్లారు. ఈ క్రమంలోనే మధ్యాహ్న సమయంలో స్వామి ఇంటిని పొగలు కమ్మేయడంతో స్థానికులు వెళ్లి చూడగా సామగ్రి మంటల్లో కాలి బూడిదవుతుంది. టీవీ, ఫ్రిజ్, బీరువ, పొలం పట్టా కాగితాలతో వంట సామగ్రి దగ్ధమవడంతో మంటలు ఎగిసిపడ్డాయి. వెంటనే స్థానికులు ఎగిసిపడిన మంటలను చల్లార్చినప్పటికి ఫలితం లేకపోయింది. అప్పటికే ఇంటితో సహా ఇంట్లోని వస్తువులు కాలిబూడిదవడంతో సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం.


లింగిగిరి తండాలో దగ్ధమైన వస్తువులు

హరీశ్‌రావును పరామర్శించిన బీఆర్‌ఎస్ నేత

కొత్తగూడ, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటివారి వేంపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ గుగులోత్ సురేష్ మాజీమంత్రి హరీశ్‌రావును శనివారం హైదరాబాద్‌లో పరామర్శించారు. ఇటీవల హరీశ్‌రావు తండ్రి మృతి చెందగా ఆయన పరామర్శించారు.

సంజీవరావుకు పీహెచ్‌డీ పట్టా ప్రదానం

కురవి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజోలు గ్రామానికి చెందిన సంకు సంజీవరావుకు హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పట్టాను శుక్రవారం ప్రదానం చేసింది. 'మల్టీ మోడల్ ఎమోషన్ రికగ్నైజేషన్ యూజింగ్ ఎన్ ఎఫెక్టింగ్ డాటా ఫ్యూషన్ మెథడాలజీ' అనే అంశంపై ఇంజనీరింగ్‌లో పరిశోధన పత్రాన్ని సమర్పించారు. మాతూరి వెంకట సుబ్బారావు ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ బి.సంధ్య మార్గదర్శకంలో అతను తన పరిశోధనను పూర్తి చేశారు.


సంజీవరావుకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్న ప్రొఫెసర్ సంధ్య

కాళోజీ వాకర్స్ శ్రమదానం

మహబూబాబాద్ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. ఎన్టీఆర్ స్టేడియం ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా చెత్త, చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా కాళోజీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నామిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇచ్చిన విధంగా పరిసరాల పరిశుభ్రతపై కూడా శ్రద్ధ కనపర్చాలని చెప్పారు. కాళోజీ వాకర్స్ సభ్యుల సహకారంతో ఎన్టీఆర్ స్టేడియంలోని పరిసరాలను పరశుభ్రపరిచామని ప్రతీ ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని అన్నారు. కోశాధికారి సోమ విష్ణువర్థన్, మేడ వెంకటేశ్వర్లు, తోలం వెంకటేశ్వర్లు, బూర్ల ప్రభాకర్‌గౌడ్, శ్యామల శ్రీనివాస్‌రెడ్డి, పొనుగోటి రామకృష్ణరావు, ఆకుల వెంకటేశ్వర్లు, పెద్ది వెంకన్న, దామోదర్, రాము, వెంకన్న, రవి, భిక్షం, శంకర్, నరేష్‌రెడ్డి, భద్రునాయక్, రాజు, లక్ష్మయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ స్టేడియంలో శ్రమదానం చేసి చెత్తను తొలగిస్తున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు


ట్రస్మా జిల్లాస్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సర్వయ్య

క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి

● మానుకోట రూరల్ సీఐ సర్వయ్య

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయని మానుకోట రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. మహబూబాబాద్ శివారు జమాండ్లపల్లి లోని విద్యాభారతి హైస్కూల్‌లో ట్రస్మా జిల్లాస్థాయి క్రీడోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడారు. క్రీడలతో స్నేహ సంబంధాలు బలపడుతాయని చెప్పారు. విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత నిస్తూ కొంత సమయం కేటాయించాలని తెలిపారు. క్రీడల్లో రాణించిన వారు ఎంతో మంది అత్యున్నత శిఖరాలను అధిరోహించారని పేర్కొన్నారు.

ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు క్రీడలు దోహదపడుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై దీపికారెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ఏకాంతంగౌడ్, దేవేందర్‌రెడ్డి, ఖలీల్‌పాష, నరేష్‌రెడ్డి, తక్కెళ్లపల్లి ప్రభాకర్‌రావు, తాళ్లపల్లి రమేష్, భూపాల్‌రెడ్డి, సురేష్, కమ్మగాని కృష్ణమూర్తి, కార్తీక్ పాల్గొన్నారు.

'గీత వృత్తిదారుల బకాయిలు చెల్లించాలి'

మహబూబాబాద్ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా గీత వృత్తిదారులకు చెల్లించాల్సిన రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియో బకాయిలను తక్షణమే ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు దొంతు రాంమూర్తి, కోశాధికారి నక్క నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్‌కు శనివారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీతవృత్తిలో ఉండి సభ్యత్వం, గుర్తింపు కార్డులేని వారికి సభ్యత్వం, గుర్తింపు కార్డులు అందించాలని కోరారు. 1/70 యాక్టులో ఉన్న ఏజెన్సీ జిల్లాల్లో గీత వృత్తిదారులకు టీఎఫ్‌టీలు, సొసైటీలు మంజూరు చేసి, ప్రభుత్వ పథకాలన్నింటిని వర్తింపజేయాలన్నారు. ప్రతీ సొసైటీకి, టీఎఫ్‌టీలకు వన పెంపకానికి పది ఎకరాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తండా సతీష్, వెంకన్న, పెద్ద వెంకన్న, వీరన్న, లచ్చయ్య, ఎల్లయ్య, కృష్ణ, కొమరయ్య, గోవర్ధన్, ఉప్పలయ్య, భద్రయ్య, నర్సయ్య, లచ్చయ్య, అశోక్, రోషాలు, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న గీత పనివారల సంఘం నేతలు

మునిసిపల్ ఎన్నికలు నిర్వహించాలి

జనగామ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ ఎన్నికలు నిర్వహించకపోవడంతో పట్టణాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయాయని, ప్రభుత్వం వెంటనే మునిసిపల్ ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. సీపీఎం పట్టణ కమిటీ సమావేశం శనివారం నిర్వహించగా ముఖ్యఅతిథిగా అబ్బాస్ హాజరై మాట్లాడారు. మునిసిపల్ పాలకవర్గం లేకపోవడంతో ప్రజల సమస్యల పరిష్కరం కోసం మునిసిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న స్పెషల్ అధికారులు సరిగ్గా పనిచేయకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మోకు కనకారెడ్డి, జోగు ప్రకాశ్ పాల్గొన్నారు.

కుల వివక్ష లేకుండా కలిసుండాలి..: ఏసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ చేతన్‌నితిన్

జనగామ రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ కుల వివక్ష లేకుండా కలిసిమెలిసి ఉండాలని జనగామ ఏసీపీ పండారి చేతన్ నితిన్ సూచించారు. జనగామ పోలీసు స్టేషన్‌లో శనివారం ఏసీపీ ఓబుల్ కేశ్వపూర్ గ్రామ అన్ని కులసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితం ఓబుల్ కేశ్వపూర్‌లో ఎస్సీలకు కుమ్మరి కులస్తులు కుండలు ఇవ్వగా కొందరు వ్యక్తులు ఎస్సీలకు కుండలు ఇస్తే మాకు ఇవ్వొద్దని కుమ్మరి కులస్తులను సాంఘికంగా బహిష్కరించడం జరిగిందన్నారు. దీంతో గ్రామంలో అన్ని కులాల పెద్దమనుషుల సమక్షంలో సమావేశం నిర్వహించి అందరు కలిసి కట్టుగా ఉండాలని సూచించామన్నారు. గ్రామాల్లో ఎలాంటి శుభ, అశుభ కార్యక్రమాలు జరిగిన కుమ్మరి కులస్తుల వద్ద నుంచే కుండలు తీసుకుంటామని ఒప్పందం చేయించామన్నారు. సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్సై చెన్నకేశవులు పాల్గొన్నారు.

న్యాయ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనిత

మహబూబాబాద్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : న్యాయ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తొర్రూరు కోర్టులో సూపరిండెంట్‌గా పని చేస్తున్న భూక్య అనిత నియామకమయ్యారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం రాష్ట్ర కార్యదర్శి ముబీన్ అహ్మద్ ఈ మేరకు ప్రకటించి అనితకు నియామక పత్రాన్ని అందించారు. అనంతరం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అనితను సంఘం నేతలు, న్యాయ ఉద్యోగులు సన్మానించారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి భూక్య అనిత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు పోలెపల్లి శ్రీనివాస్, వీరునాయక్, అహ్మద్‌ఖాన్, పూస శ్రీనివాస్, స్వరూప, శివకుమార్, రవీందర్, కల్యాణ్, మల్లయ్య, ఖాజమైనుద్దీన్, వెంకటరాజేందర్, సత్తార్, ప్రదీప్, సాయిరాం పాల్గొన్నారు.


మానుకోటలో భూక్యా అనితను సన్మానిస్తున్న సంఘం నేతలు